

నేడు విద్యుత్ బిల్లుల వసూళ్లు

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం

జిల్లాలోని అన్ని విద్యుత్ రెవెన్యూ కార్యాలయాల్లో విద్యుత్ బిల్లులు వసూళ్ల కౌంటర్లు ఆదివారం సెలవు దినంలో కూడా పని చేస్తాయని ఎపిఇపిడిసిఎల్ జిల్లా సూపరింటెండింగ్ ఇంజినీర్ టివిఎస్.ఎన్. మూర్తి తెలిపారు. కూడ పని చేస్తాయి. కావున జిల్లాలోని విద్యుత్ వినియోగదారులు అందరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోని విద్యుత్ బిల్లులను చెల్లించాల్సిందిగా ఆయన కోరారు. విద్యుత్, రెవెన్యూ కార్యాలయాలతో పాటు, ఎపిఇపిడిసిఎల్ సెక్షన్ ఆఫీస్ కలెక్షన్ కౌంటర్లు, ఎటిపి సెంటర్లలో కూడా ఈ ఆదివారం బిల్లులు చెల్లించవచ్చునని ఆయన తెలిపారు. కావున విద్యుత్ వినియోగదారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాల్సిందిగా ఆయన సూచించారు.

ఉత్సాహంగా మహానాడు

- ప్రతినిధుల సభకు వేలాది మంది రాక
- హైవేపై 3 గంటల పాటు ట్రాఫిక్ రద్దీ
- నేడు భారీ బహిరంగ సభ

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం ప్రతినిధి

తెలుగుదేశం పార్టీ చేపట్టిన మహానాడు కార్యక్రమంగా శనివారం ఉత్సాహంగా ప్రారంభమైంది. తూర్పుగోదావరి జిల్లా కడియం మండలం వేమగిరిలో రెండ్రోజుల పాటు ఈ మహానాడు జరుగనుంది. వేలాది మంది ప్రతినిధుల రాకతో వేమగిరి ఒక్కసారి కిక్కిరిసింది. ఈ కార్యక్రమంలో భాగంగా తొలి రోజు ప్రతినిధుల సభను నిర్వహించారు. ఆదివారం బహిరంగ సభను నిర్వహించనున్నారు. ప్రతినిధుల సభ కార్యక్రమంలో భాగంగా ఉదయం 8.30 గంటలకు సభ్యత్వ నమోదు ప్రారంభించారు. ఆ పార్టీ జాతీయ అధ్యక్షులు నారా చంద్రబాబునాయుడు చిత్తూరు విభాగంలోనూ, యువనేత నారాలోకేష్ గుంటూరు విభాగంలోనూ పేర్లు నమోదు చేయించుకున్నారు. అనంతరం 11 గంటలకు చంద్రబాబు పతాకావిష్కరణ చేశారు. జ్యోతి ప్రజ్వలన చేసి ఎన్‌టిఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. మా తెలుగు తల్లికి మల్లెపూదండ గీతాలాపనతో కార్యక్రమం ప్రారంభించారు. కార్యదర్శి నివేదికను ప్రధాన కార్యదర్శి వర్ల రామయ్య ప్రవేశ పెట్టారు. ఇటీవల కాలంలో మరణించిన పార్టీ నాయకులు, కార్యకర్తలకు సంతాపంగా రెండు నిముషాలు మౌనం పాటించారు. అనంతరం ఒక్కొక్కరుగా తీర్మానాలను ప్రవేశ పెట్టగా ప్రతినిధులు ఏకగ్రీవంగా ఆమోదించారు.

హైవేపై ట్రాఫిక్ రద్దీ

మహానాడు సభకు ఆ పార్టీ శ్రేణులు అంచనా వేసినట్లుగానే సుమారు 15 వేల మంది హాజరయ్యారు. ఈ నేపథ్యంలో రాజమహేంద్రవరం జాతీయ రహదారిపై ఉదయం 7 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు ట్రాఫిక్ రద్దీ నెలకొంది. రాష్ట్రంలోని పలు ప్రాంతాల నుంచి ప్రతినిధులు వివిధ వాహనాల్లో జిల్లాకు చేరుకున్నారు. వాహనాలతో ఉదయం 11 గంటలకే పార్కింగ్ ప్రాంతాలు నిండిపోయాయి. పోలీసులు ముందస్తు చర్యలు చేపట్టినా ఫలితం లేకపోయింది. దీంతో 2 కిలో మీటర్ల దూరంలో వాహనాలు నిలిపి, దూరంగా ఏర్పాటు చేసిన పార్కింగ్ స్థలాలకు పంపించారు. ఫలితంగా ప్రతినిధులు ఎండలోనే సుమారు 2 కిలో మీటర్లు నడిచి సభ ప్రాంగణానికి చేరుకున్నారు. ఉదయం11 గంటలకు ప్రతినిధుల సభ ప్రారంభం కావటంతో అత్యధిక మంది హైవేపై రోడ్డుకు పక్కనే వాహనాలను బారులుగా నిలిపివేశారు. దీంతో కడియం వేమగిరి నుంచి రాజమహేంద్రవరం బొమ్మూరు వరకు జాతీయ రహదారికిరువైపులా కార్లు, బస్సులు, ద్విచక్ర వాహనాలు బారులు తీరాయి.

ఎన్‌టిఆర్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ప్రత్యేక సేవలు

మహానాడు వేదికగా ఎన్‌టిఆర్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ప్రత్యేక సేవలందించారు. ప్రతినిధుల సభ ప్రాంగణంలో రక్తదాన శిబిరం ఏర్పాటు చేశారు. మరో వైపు కార్యకర్తలకు వైద్య శిబిరం నిర్వహించారు. రాజమహేంద్రవరం రూరల్ ఎంఎల్ఎ గోరంట్ల బుచ్చయ్యచౌదరి కుమారుడు డాక్టర్ రవిరామ్ గోరంట్ల పలువురు వైద్య సిబ్బంది కార్యకర్తలకు వైద్య సేవలందించారు. రెండ్రోజుల పాటు 6 టీములుగా 20 మంది డాక్టర్లు, 20 మంది నర్సులు, పారామెడికల్ సిబ్బంది సంయుక్తంగా ఈ సేవలందించనున్నారు. డయాబెటిస్, బిపి తదితర దీర్ఘకాలిక వ్యాధులతో పాటు వడదెబ్బ, ఇతరాత్ర సమస్యలతో బాధపడే వారికోసం సిలైన్లు, ఆక్సిజన్ సిలిండర్లు అందుబాటులో ఉంచారు. అత్యవసర సేవల కోసం అంబులెన్స్‌లను సైతం సిద్ధం చేశారు. తొలి రోజు సుమారు 500 మందికి సేవలందించారు.

అలాగే ప్రాంగణం వద్ద ఏర్పాటు చేసిన ఫొటో ఎగ్జిబిషన్ పలువురిని ఆకట్టుకుంది. పలువురు ప్రతినిధులు ఫొటో ఎగ్జిబిషన్‌ను ఆసక్తిగా తిలకించారు.

నేడు భారీ బహిరంగ సభ

నేడు భారీ బహిరంగ సభ నిర్వహించనున్నారు. మధ్యాహ్నం 2 గంటలకు సభ ప్రారంభం కానుంది. రాష్ట్రంలోని నలు మూలల నుంచి తెలుగుదేశం పార్టీ అభిమానులు, కార్యకర్తలు ఈ సభకు తరలిరానున్నారు. సుమారు 15 లక్షల మంది రానున్నట్లు ఆ పార్టీ శ్రేణులు అంచనా వేస్తున్నాయి. వచ్చిన వారందరికీ రాజమహేంద్రవరం ముఖ ద్వారాలలోనే భోజనం ఏర్పాట్లు అందుబాటులోకి తీసుకొచ్చారు. జిల్లా అధికార యంత్రాంగం ట్రాఫిక్ క్రమబద్ధీకరణకు ప్రత్యేక ప్రణాళిక రూపొందించింది. దూర ప్రాంతాల నుంచి తరలివచ్చే వాహనాలు నిలుపుదలకు పార్కింగ్ స్థలాలను గుర్తించింది. ఆయా పార్కింగ్ స్థలాలు సభా ప్రాంగణానికి సుమారు 2 నుంచి 3 కిలో మీటర్ల దూరంలో ఉండటంతో ఇబ్బందులు ఎదురయ్యే పరిస్థితులు నెలకొన్నాయి.



మహానాడుకు హాజరైన ప్రతినిధులు (ఇన్‌సెట్‌లో మాట్లాడుతున్న చంద్రబాబు)



ప్రతినిధులను ఉత్సాహపరుస్తున్న లోకేష్



అచ్చెన్నాయుడు, చంద్రబాబు మాటా మంతీ...



హాజరైన మహిళా ప్రతినిధులు



జాతీయ రహదారిపై నిలిచిన వాహనాలు



దీక్షలో పాల్గొన్న ఉద్యోగులు

సమస్యలు పరిష్కరించాలని ఎపిజిఇఎ దీక్ష

ప్రజాశక్తి-నిడదవోలు

తమ సమస్యలు పరిష్కరించాలని ఎపిజిఇఎ ఆధ్వర్యాన శనివారం నిడదవోలులో నిరాహార దీక్ష చేపట్టారు. ఈ దీక్షలో సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు డి.శ్రీకాంత్ రాజు మాట్లాడారు. నాలుగు రోజులుగా తమ సంఘం రాష్ట్రవ్యాప్తంగా పెద్ద ఎత్తున ఆందోళనా కార్యక్రమాలు చేపట్టినా ప్రభుత్వానికి చీమ కుట్టినట్టయినా లేదన్నారు. 1వ తేదీనే జీతాలు చెల్లించాలని, సిపిఎస్ రద్దు చేయాలని, కాంట్రాక్టు ఉద్యోగులను రెగ్యులరైజ్ చేయాలని, తాము దాచుకున్న నిధులైన జిపిఎఫ్, ఎపిజిఎల్ఐకు రక్షణ కల్పించాలని, పెన్షనర్లకు రావాల్సిన ఉద్యోగ విరమణ అనంతరం ప్రయోజనాలు తమ ఆర్థిక బకాయిలు చెల్లించాలని డిమాండ్ చేశారు. ఇకనైనా ప్రభుత్వం తక్షణమే తమను చర్చలకు ఆహ్వానించాలని, తమ డిమాండ్‌లను తక్షణమే పరిష్కరించాలని కోరారు. మండుటెండలో 70 శాఖలకు చెందిన ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మిక, రిటైర్ ఉద్యోగులు రోడ్డెక్కి ఆందోళన చేపడుతున్నా ప్రభుత్వం స్పందించక పోవడం సరికాదన్నారు. ప్రభుత్వం ఉద్యోగులను చిన్న చూపు చూస్తోందన్నారు. ఉద్యోగులను ప్రాధాన్యతలోకి తీసుకోవడం లేదన్నారు.

నగరంలో నేడు ట్రాఫిక్ మళ్లింపు

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం

టిడిపి మహానాడు నేపథ్యంలో ప్రజల సౌకర్యార్థం ట్రాఫిక్‌ను మళ్లిస్తున్నామని ఎస్‌పి కార్యాలయం ఒక ప్రకటనలో పేర్కొంది. విజయవాడ నుంచి తాడేపల్లిగూడెం మీదుగా వచ్చే అన్ని భారీ వాహనాలూ ఏలూరు జిల్లా గుండుగొలను వైపు నుంచి కొవ్వూరు గామన్ బ్రిడ్జి మీదుగా మళ్లించామన్నారు. తాడేపల్లిగూడెం, భీమవరం మీదుగా వచ్చే అన్ని భారీ వాహనాలు రావులపాలెం, ఆలమూరు, మండపేట మీదుగా కాకినాడ, ప్రత్తిపాడు, కత్తిపూడి మీదుగా మళ్లించారు. విశాఖ నుంచి విజయవాడ వైపు వెళ్లే వాహనాలు దివాన్ చెరువు నుంచి గామన్ బ్రిడ్జి మీదుగా దారి మళ్లించారు. విశాఖ నుంచి తాడేపల్లిగూడెం, తణుకు, భీమవరం వచ్చే వాహనాలను కత్తిపూడి, కాకినాడ, రామచంద్రాపురం, ఆలమూరు, రావులపాలెం మీదుగా మళ్లించారు. కొవ్వూరు రోడ్డు కం రైల్ బ్రిడ్జి మీదుగా వచ్చే వాహనాలను గామన్ బ్రిడ్జి మీదుగా మళ్లించారు. పెరవలి, సమిశ్రగూడెం, విజ్జేశ్వరం వైపు నుంచి వచ్చే వాహనాలను కొవ్వూరు గామన్ బ్రిడ్జి మీదుగా సిటీ లోకి అనుమతిస్తారు. ధవళేశ్వరం బ్యారేజి నుంచి ఎటువంటి భారీ వాహనాలనూ అనుమతించరు. విశాఖ వైపు నుంచి వచ్చే వాహనాలు లక్ష్మి ఐశ్వర్య నర్సరీ పక్కన, టేస్టీ ఫుడ్ ప్లాజా పక్కన, ఆంధ్రభూమి ఆఫీస్‌కు ఎదురుగా పార్క్ చేయాలన్నారు.

కందుకూరికి ఘన నివాళి

ప్రజాశక్తి-రాజమహేంద్రవరం


కందుకూరి వీరేశలింగం 104వ వర్ధంతి సందర్భంగా ఎస్ఎఫ్ఐ విద్యార్థుల బందం శనివారం ఆయనకు ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ మాజీ జిల్లా కార్యదర్శి బి.పవన్, ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి ఎన్.రాజా మాట్లాడారు. కందుకూరి వీరేశలింగం గొప్ప సంఘసంస్కర్త అని ఆయన స్త్రీ విద్య కోసం కషి చేసిన వ్యక్తి అని చెప్పారు. సొంత ఆస్తిని సైతం సమాజం కోసం పంచిన మహనీయుడని కొనియాడారు. విద్యార్థులు, నేటి యువతరం అందరూ కూడా ఆయన ఆదర్శంగా తీసుకోవాలని కందుకూరి ఆశయాలను కాపాడాలని తెలిపారు. విద్యావ్యాప్తి కోసం కందుకూరి తన ఆస్తిని, జీవితాన్ని త్యాగం చేశారన్నారు. ఆయనకు నివాళులు అర్పించడం అంటే కందుకూరి విద్యాసంస్థలను అభివృద్ధి చేయాలన్నారు. విద్యాసంస్థలకు నిధులు కేటాయించి అభివృద్ధి చెయ్యాలన్నారు.



నివాళి అర్పిస్తున్న నాయకులు

టిడిపి ఆధ్వర్యాన స్వీట్ల పంపిణీ

చాగల్లు : చాగల్లు మెయిన్ బజార్‌లో ఎన్టీఆర్ విగ్రహానికి టిడిపి సీనియర్ నాయకులు అల్లాడి సుబ్బారావు ఆధ్వర్యంలో పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం స్థానికులకు స్వీట్లు పంచారు. మహానాడు మహాసభకు ఆదివారం భారీ ఎత్తున తరలి వెళుతున్నట్లు అని తెలిపారు. ఈ కార్యక్రమంలో అంబటి పెద్దబ్బులు, ఆళ్ల అబ్బులు, కొడవటి ప్రసాద్, కోడి దుర్గారావు పాల్గొన్నారు.



గవర్నర్‌ను కలిసిన విసి పద్మరాజు

గవర్నర్‌ను కలిసిన నన్నయ విసి

ప్రజాశక్తి-రాజానగరం

ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయ విసిగా నూతనంగా బాధ్యతలు స్వీకరించిన ఆచార్య కె.పద్మరాజు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర గవర్నర్, విశ్వవిద్యాలయాల కులపతి ఎస్.అబ్దుల్ నజీర్‌ను శనివారం మర్యాదపూర్వకంగా కలిశారు. గవర్నర్ కార్యాలయంలో నజీర్‌కు పుష్పగుచ్చం అందించి నన్నయ విసిగా నియమించినందుకు కతజ్ఞతలు తెలిపారు. ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయ అభివద్ధికి కషి చేస్తానని, విశ్వవిద్యాలయ అభివద్ధి ప్రణాళికను గవర్నర్‌కు వివరించారు. నూతనంగా బాధ్యతలు స్వీకరించిన విసి ఆచార్య కె.పద్మరాజుకు గవర్నర్ అబ్దుల్ నజీర్ శుభాకాంక్షలను తెలిపారు.

పాలచర్ల పిహెచ్‌సిలో కలెక్టర్ తనిఖీలు

వైద్యాధికారికి షోకాజ్, హెడ్‌నర్స్ సస్పెన్షన్

ప్రజాశక్తి-రాజానగరం

మండలంలోని పాలచర్ల ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని కలెక్టర్ డాక్టర్ కె.మాధవీలత శనివారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. విధుల్లో నిర్లక్ష్యం వహించిన ఆరోగ్య కేంద్రం వైద్యాధికారికి షోకాజ్ నోటీసు జారీ చేయాలని, హెడ్ నర్స్‌ను సస్పెండ్ చేయాలని అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. ఉదయం సమయంలో 10 గంటల నుండి 11 గంటల మధ్యలో ఎక్కువ మంది రోగులు ఉంటారని, ముగ్గురు, నలుగురు ఉండడం ఏమిటని వైద్య సిబ్బందిని ప్రశ్నించారు. ఆసుపత్రి రికార్డులను పరిశీలించారు. విధుల్లో నిరక్ష్యంగా ఉన్నారని వైద్యాధికారి డాక్టర్ టి.బెనెడిక్ట్‌కు షోకాజ్ నోటీస్ జారీ చేయాలని, హెడ్ నర్స్ ఎస్.గంగాభవానిని సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులు జారీ చేయాలని జిల్లా వైద్య ఆరోగ్య అధికారిని కలెక్టర్ ఆదేశించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గర్భిణులు, బాలింతలు, చిన్న పిల్లల ఆరోగ్యంపై శ్రద్ధ తీసుకోవాల్సిన బాధ్యత వైద్య సిబ్బందిపై ఉందన్నారు. వీరు ఎప్పుడూ అందుబాటులో ఉంటూ వారికి అందిస్తున్న వైద్య సేవల వివరాలు రికార్డ్ చేయాలని సూచించారు. ఏ నెలలో ఎంతమంది గర్భిణులు డెలివరీ తేదీలతో సమగ్ర సమాచారం పిహెచ్‌సి, సిహెచ్‌సిల్లో ఉండాలని ఆదేశించారు. ఈ బాధ్యత సంబంధిత డాక్టర్లదన్నారు. ఏప్రిల్ నెలలో 3 డెలివరీ లు అయ్యాయని సిబ్బంది తెలిపారు. మే నెలలో వివరాలు పరిశీలించి, జూన్, జూలై, ఆగష్టు సమాచారం మేరకు వారికి తగిన వైద్య సేవలు, మందులు అందించే చర్యలు తీసుకోవాలని కలెక్టర్ సూచించారు. తొలుత కలెక్టర్ హౌసింగ్ లే అవుట్‌ను పరిశీలించారు. నిర్మాణంలో ఉన్న 37 ఇళ్లను పరిశీలించారు. నిర్మాణం పూర్తయిన 16 ఇళ్లకు విద్యుత్ సరఫరా ఇచ్చారని, ఇంకా నిర్మాణాలు చేపట్టాల్సిన 12 ఇళ్లను వెంటనే నిర్మాణాలు చేపట్టేలా లబ్ధిదారులకు అవగాహన కలిగించాలని అధికారులను ఆదేశించారు. కలెక్టర్ వెంట జిల్లా హౌసింగ్ అధికారి జి.పరశురామ్, తహశీల్దార్ ఎన్ఎస్.పవన్ కుమార్, విద్యుత్ శాఖ ఇఇ డేవిడ్, ఆర్‌డబ్ల్యుఎస్ డిఇ రవికుమార్ సిబ్బంది పాల్గొన్నారు.



ఆసుపత్రిలో తనిఖీ చేస్తున్న కలెక్టర్

పారిశుధ్య నిర్వహణకు ప్రాధాన్యత ఇవ్వాలి

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం

ప్రజలకు అందుబాటులో వైద్య సేవలు అందించే ప్రభుత్వ ఆరోగ్య కేంద్రాలలో పారిశుధ్య నిర్వహణకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని కలెక్టర్ డాక్టర్ కె.మాధవీలత పేర్కొన్నారు. శనివారం తాడితోట అంబేడ్కర్ పట్టణ ఆరోగ్య కేంద్రాన్ని కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాధవీలత మాట్లాడుతూ, నిత్యం ప్రజలకు చేరువలో అర్బన్ హెల్త్ సెంటర్ ద్వారా మెరుగైన వైద్య సేవలు అందించాల్సి ఉంటుందన్నారు. ఇందులో భాగంగా ఆయా ఆరోగ్య కేంద్రాల నిర్వహణలో పారిశుధ్య నిర్వహణకు కూడా తగిన ప్రాధాన్యత ఇవ్వాలని తెలిపారు. ప్రతిరోజూ ఎన్ని ఒపిలు చూస్తారని కలెక్టర్ అడుగగా 40 నుంచి 50 మంది వరకూ వస్తారని సిబ్బంది తెలిపారు. ప్రతి శనివారం చిన్న పిల్లలకి ఇమ్యునైజేషన్ చేస్తామన్నారు.

పశువుల పాక దగ్ధం

ప్రజాశక్తి-చాగల్లు

చాగల్లు మండలం గౌరిపల్లి గ్రామంలో శనివారం తెల్లవారు జామున పాడి రైతు గుంటి నాగేశ్వరరావుకు చెందిన పశువుల పాక అగ్ని ప్రమాదంలో దగ్ధమయ్యింది. ఈ ప్రమాదంలో పశువుల పాక పూర్తిగా దగ్ధమయ్యింది. పాకలో ఉన్న ఒక గేదె, ఆవు గాయపడ్డాయి. చాగల్లు పశు వైద్యాధికారి డాక్టర్ యు.ముఖేష్, మల్లవరం పశువైద్య అసిస్టెంట్ గౌతమ్ కుమార్ వాటికి చికిత్స చేశారు.

కుటుంబ సభ్యులుగా వాలంటీర్లు

ప్రజాశక్తి - ఉండ్రాజవరం

గ్రామ వాలంటీర్లను తమ కుటుంబ సభ్యులుగా పింఛన్‌దారులు భావిస్తున్నారని నిడదవోలు ఎంఎల్ఎ జి.శ్రీనివాస్ నాయుడు అన్నారు. శనివారం మండలంలోని ఉండ్రాజవరంలో మొదటి విడతగా వేలివెన్ను, కాల్దారి, పసలపూడి, సూర్యారావుపాలెం, చిలకపాడు, వడ్లూరు, సత్యవాడ గ్రామాల వాలంటీర్లకు ఏర్పాటు చేసిన అవార్డుల అందజేత కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. మొదటి తేదీ తెల్లవారుజామునే పింఛనందిస్తున్న వాలంటీర్లను తమ మనవడు, తమ మనుమరాలు పింఛను డబ్బులు ఇంటికి తెచ్చిస్తున్నారని చెప్పుకుంటున్నారన్నారు. ప్రజలకు, ప్రభుత్వానికి మధ్య వారధులు వాలంటీర్లన్నారు. వాలంటీర్లు సేవా భావంతో పనిచేస్తూ కేటగిరి వారీగా సేవా మిత్ర, సేవారత్న, సేవా వజ్రలుగా గుర్తించి, ప్రభుత్వం అవార్డులు అందించి, ప్రోత్సహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ సలహా మండలి చైర్మన్ బూరుగుపల్లి సుబ్బారావు, జెడ్‌పిటిసి నందిగం భాస్కర రామయ్య, వైస్ ఎంపిపిలు, షాజహాన్, ఆయా గ్రామ సర్పంచులు, కొఠారు సత్యనారాయణ, నాగిరెడ్డి వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.




అవార్డు గ్రహీతలతో ఎంఎల్ఎ శ్రీనివాస్ నాయుడు

ఆరోగ్యశ్రీ సేవలను విస్తరించాలి

ప్రజాశక్తి-రాజమహేంద్రవరం

ఇకపై ప్రభుత్వాసుపత్రులు, సిహెచ్‌సిలు, పిహెచ్‌సిల ద్వారా ఆరోగ్యశ్రీ వైద్య సేవలును 50 శాతం మేర విస్తరించాలని కలెక్టర్ డాక్టర్ కె.మాధవీలత స్పష్టం చేశారు. శనివారం కలెక్టరేట్ స్పందన సమావేశ మందిరంలో ఆరోగ్యశ్రీ సేవలు అమలు తీరుపై మెడికల్ ఆఫీసర్స్‌తో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాధవీలత మాట్లాడుతూ, ఆరోగ్యశ్రీ ట్రస్ట్ ద్వారా అందచేసే వైద్య విధానం ద్వారా ప్రభుత్వ ఆర్థిక వనరులను సద్వినియోగం చేసుకునే అవకాశం ఉందని అన్నారు. ఆ ప్రక్రియలో భాగంగా ఆయా ప్రభుత్వాసుపత్రులకు చెందిన మెడికల్ ఆఫీసర్స్ మెరుగైన పనితీరు చూపాల్సిన కనీస బాధ్యత ఉండాలని స్పష్టం చేశారు. కొందరు మెడికల్ ఆఫీసర్స్ పనితీరు మెరుగు పరిచేందుకు కషి చేస్తుండడం అభినందనీయం అని అన్నారు. అయినప్పటికీ ప్రవేటు ఆసుపత్రులతో పోల్చితే ప్రభుత్వ వైద్యుల పనితీరు సంతప్తికరంగా లేదని తెలిపారు. వైయస్ఆర్ ఆరోగ్యశ్రీ ట్రస్ట్‌లో జిల్లాలోని అన్ని వివిధ స్థాయి లో ఉన్న ప్రభుత్వ ఆసుపత్రులు ఖచ్చితంగా ఎంప్యానెల్‌మెంట్ చేసుకోవాలని మాధవీలత స్పష్టం చేశారు. ఆయా ఆసుపత్రులలో పనిచేస్తున్న వైద్యాధికారులు పేర్లు నమోదు చేసుకోవడం, బయో మెట్రిక్ ప్రక్రియ సోమవారం నాటికి పూర్తి చేయాల్సి ఉంటుందన్నారు. గర్భిణులకు వైద్య సేవలు అందించే సామర్థ్యం పెంచుకోవాలన్నారు. ఆరోగ్యశ్రీ ట్రస్ట్‌లో ఆయా ఆసుపత్రుల నమోదుతో పాటు వైత్యాధికారులు కూడా వారి పేర్లు నమోదు పూర్తి చెయ్యాలని కలెక్టర్ స్పష్టం చేశారు. సోమవారం సాయంత్రం నాటికి సంపూర్ణ నివేదిక అందచేయాలని, ఎర్కొన్నారు. ఈ సమావేశంలో జిల్లా వైద్యాధికారులు డాక్టర్ ఎన్.వసుంధర, ఆరోగ్యశ్రీ కో ఆర్డినేటర్ డాక్టర్ పి.ప్రియాంక, ఇన్‌ఛార్జి డిసిహెచ్ఎస్ డాక్టర కె.సాయికుమార్, డాక్టర్ అభిషేక్ పాల్గొన్నారు.

కార్టూ'నిజం'



రూ.6,756 కోట్ల విద్యుత్ బకాయిలు

జూన్ 15 నాటికి పనుల పూర్తి

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం

రానున్న వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకుని నగరంలో చేపట్టిన అభివద్ధి పనులన్నీ జూన్ 15 నాటికి నూరుశాతం పూర్తి చేయాలని నగరపాలక సంస్థ కమిషనర్ కె.దినేష్ కుమార్ ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు. శనివారం పలు అభివద్ధి పనులను క్షేత్రస్థాయిలో ఆయన పరిశీలించారు. ప్రాధాన్యతాక్రమంలో మేజర్ పనులను పూర్తి చేయాలని ఆదేశించారు. ముఖ్యంగా కాలువల్లో పూడికతీత పనులకు అధిక ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. ముంపు ప్రాంతాలను గుర్తించి ఎక్కడా ముంపు సమస్య తలెత్తకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని ఆదేశించారు.

అంగన్‌వాడీ కేంద్రాల్లో తనిఖీలు

ప్రజాశక్తి-రాజమహేంద్రవరం

అంగన్వాడీ కేంద్రాల్లో నాణ్యత లేని, బరువు తక్కువ ఉన్న కోడిగుడ్లు పంపిణీ జరుగుతున్నట్లు తమ తనిఖీల్లో గుర్తించామని ఆయా కాంట్రాక్టర్లను బ్లాక్ లిస్టులో ఉంచాల్సిందిగా ప్రభుత్వానికి సిఫార్సు చేస్తున్నట్లు రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యులు గొండు సీతారాం, ఆదిలక్ష్మి త్రిపర్ణ పేర్కొన్నారు. శనివారం నగరంలోని ఇన్నీసుపేటలోని 3, 4వ అంగన్వాడీ కేంద్రాలను వారు తనిఖీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా పిల్లలకు అందజేస్తున్న పౌష్టికాహార పదార్థాల నాణ్యతను పరిశీలిస్తున్నట్టు తెలిపారు.

మహానాడుకు రావాలని ఆహ్వానం

ప్రజాశక్తి-తాళ్లపూడి

రాజమహేంద్రవరంలో తెలుగుదేశం పార్టీ మహానాడుకు కుటుంబ సమేతంగా రావాలంటూ ఆ పార్టీ మహిళా కార్యకర్తలు వినూత్న రీతిలో ఇంటింటికీ తిరిగి బొట్టు పెట్టి ఆహ్వానిస్తున్నారు. అన్నదేవరపేట గ్రామానికి చెందిన టిడిపి యువగళం సభ్యులు మహానాడు జరిగే వేమగిరికి శనివారం బయలుదేరి వెళ్లారు. మాజీ జెడ్‌పిటిసి అల్లూరి విక్రమాదిత్య, కాకర్ల సత్యేంద్ర, జివి.ప్రసాద్, కె.గణేష్, నాగేంద్ర, లీల, భరత్, ఆదిత్య మహానాడుకు తరలి వెళ్లిన వారిలో ఉన్నారు.

చివటంలో ఫ్యామిలీ ఫిజీషియన్

ప్రజాశక్తి - ఉండ్రాజవరం

ఫ్యామిలీ ఫిజీషియన్ కార్యక్రమంలో భాగంగా చివటం గ్రామంలో వివిధ రకాల సమస్యలపై వచ్చిన 70 మంది పేషంట్లకు పరీక్షలు నిర్వహించినట్లు ఉండ్రాజవరం పిహెచ్‌సి వైద్యాధికారి డాక్టర్ ఆర్.ప్రసాద్ తెలిపారు. వీరిలో హైపర్ టెన్షన్, డయాబెటిస్, మెల్లిటస్, బిపి, సుగర్, జనరల్, ప్రసవానంతర పరీక్షలు, ఇళ్ల వద్దకు వెళ్లి మంచం పట్టిన పేషంట్లను పరీక్షించినట్లు తెలిపారు. అవసరమైన వారికి మందులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఎంఎల్‌హెచ్‌పి విజయ కుమారి, ఎఎన్ఎం సూర్య కుమారి, డిఇఒ శ్రవణ్, హెల్త్ అసిస్టెంట్ డి.సుబ్రహ్మణ్యం, ఆశాలు విజయ, సుజాత, లక్ష్మీదేవి, సంధ్య తదితరులు పాల్గొన్నారు.

జిల్లాలో 364 మొబైల్ డెలివరీ ఐరిష్ రీడర్లు

ప్రజాశక్తి-రాజమహేంద్రవరం

అర్హులందరికీ ప్రజా పంపిణీ వ్యవస్థ ద్వారా అందచేసే నిత్యావసర సరుకుల పంపిణీలో ఇబ్బందులను అధిగమించేందుకు 364 ఐరిష్ రీడర్లను సమకూర్చినట్టు జాయింట్ కలెక్టర్ ఎన్.తేజ్ భరత్ తెలిపారు. శనివారం తన ఛాంబర్‌లో ఎంయుడి యజమానులకు ఐరిష్ రీడర్లను డిఎస్ఒ పి.ప్రసాదరావుతో కలిసి ఆయన అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, రాష్ట్రంలో ప్రజా పంపిణీ వ్యవస్థ ద్వారా పేదలకు ఆహార భద్రత చట్టం క్రింద కార్డుదారుల ఆధార్, బయోమెట్రిక్ ధవీకరణ ప్రామాణికంగా తీసుకుని నిత్యావసర వస్తువులు పంపిణీ చేస్తున్నట్టు తెలిపారు. కుష్టు వ్యాధిగ్రస్తులు, వద్ధులు, రోజువారీ కూలీల వేలి ముద్రల్లో సమస్యల కారణంగా బయోమెట్రిక్‌లో ఇబ్బందులు ఎదుర్కొంటున్నట్లు తెలిపారు. ఈ ప్రక్రియకు సంబంధించి వేలిముద్రలు సరిగా పడని లబ్ధిదారుల సౌకర్యార్థం ఐరిష్ రీడర్లను సమకూర్చినట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎఎస్ఒ భాస్కర్, ఎంపిడిఒ కార్యాలయ సిబ్బంది, డెలివరీ యూనిట్స్ సిబ్బంది పాల్గొన్నారు.

ప్రజాశక్తి
www.prajasakti.com

నేరాలు ఘోరాలు

రోడ్డు ప్రమాదంలో మహిళ మృతి

ప్రజాశక్తి - ఏలేశ్వరం

ఏలేశ్వరంలో శనివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో మహిళ మృతి చెందినట్లు ఏలేశ్వరం ఎస్ఐ జి సతీష్ తెలిపారు. ఏలేశ్వరం లింగంపర్తి కాలనీకి చెందిన వెంగళ నాగలక్ష్మి (28) నిత్యవసర వస్తువులు తీసుకునేందుకు ఇంటి నుండి తన స్కూటీ పై బయలుదేరింది. ఏలేశ్వరం లారీ యూనియన్ ఆఫీస్ వద్దకు వచ్చేసరికి జగ్గంపేట నుండి ఏలేశ్వరం మీదుగా కిమ్మూరు వెళుతున్న లారీ ఆమెను బలంగా ఢీకొట్టింది. దీంతో నాగలక్ష్మి అక్కడికక్కడే మృతి చెందింది. మృతురాలి భర్త వెంగళ శ్రీనివాస్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు. మృతురాలికి ఇద్దరు కుమారులు ఉన్నారు.

ఘర్షణలో వ్యక్తికి తీవ్రగాయాలు

ప్రజాశక్తి-ఐ.పోలవరం

ఇంటి సరిహద్దు విషయమై జరిగిన ఘర్షణలో శనివారం ఒక వ్యక్తికి తీవ్రగా గాయాలయ్యాయి. వివరాలు ఇవి.. కేశనకుర్రు గ్రామ పంచాయతీ పరిధిలో కేశనకుర్రుపాలెం పంచాయతీ పెమ్మిరెడ్డి పాలెం గ్రామానికి చెందిన బద్రి శ్రీనివాసరావు, కోడూరి వెంకట దుర్గ ఫణి కుమార్ మధ్య ఇంటి సరిహద్దు విషయమై ఘర్షణ చోటు చేసుకుంది. ఈ ఘర్షణలో శ్రీనివాసరావు కు తీవ్రగా గాయాలయ్యాడు. బంధువులు గాయపడిన వ్యక్తిని హుటాహుటీన ముమ్మిడివరం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అతనిని అక్కడ ఉన్న వైద్యులు మెరుగైన వైద్య కోసం కాకినాడ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.ఈ విషయం పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఐ పోలవరం ఎస్ఐ సిహెచ్.రాజేష్ తెలిపారు.



ప్రజల సమస్యలు తెలుసుకుంటున్న ఎంఎల్‌సి తోట

సొంతింటి కల నేరవేర్చడమే ప్రభుత్వ లక్ష్యం

ప్రజాశక్తి-మండపేట

ప్రతి పేదవానికి సొంత ఇంటిని అందించడమే ప్రభుత్వ లక్ష్యమని ఎంఎల్‌సి తోట త్రిమూర్తులు అన్నారు. శనివారం మండలంలోని ఏడిద గ్రామంలో గడప..గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం సర్పంచ్ బూరిగ ఆశీర్వాదం అధ్యక్షతన జరిగింది. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న ఎంఎల్‌సి తోట మాట్లాడుతూ వైసిపి ప్రభుత్వానికి ప్రజల నుంచి విశేష స్పందన లభిస్తుందన్నారు.

మహానాడు జరుపుకునే టిడిపి నాయకులు పార్టీ వ్యవస్థాపకులు, ఎవరు పార్టీని స్థాపించారని విషయాలను గుర్తుంచుకోవాలన్నారు. దివంగత ఎన్‌టిఆర్ రామారావు పదవి పోవడానికి, ఆయన మీద చెప్పులు వేయడానికి కారకుల ఎవరో తెలుసుకుని మహానాడు జరుపుకోవాలన్నారు. కార్యక్రమంలో వైస్ ఎంపిపి పసుమర్తి నాగేశ్వరరావు, మండల అభివృద్ధి అధికారి ఐదం రాజు, పార్టీ గ్రామ అధ్యక్షులు పలివెల సుధాకర్, చంద్రమళ్ళ బులివీరయ్య తదితరులు పాల్గొన్నారు.

వైసిపిలో పలువురి చేరిక

మండపేట ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాల పట్ల ఆకర్షితులైన ఏడిద గ్రామానికి చెందిన వందమంది కార్యకర్తలు సర్పంచ్ బూరిగ ఆశీర్వాదం, ఏడిద గ్రామ వైసిపి అధ్యక్షులు పలివెల సుధాకర్ ఆధ్వర్యంలో చేరారు. వీరికి ఎంఎల్‌సి తోట త్రిమూర్తులు పార్టీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. పార్టీ అభివృద్ధికి అండదండగా ఉండి రానున్న ఎన్నికల్లో వైసిపి ప్రభుత్వం గెలుపునకు కషి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో జెడ్‌పిటిసి సభ్యురాలు కురుపూడి భవాని, సొసైటీ ఛైర్మన్ రామిశెట్టి శ్రీహరిబాబు, వైసిపి నాయకులు చంద్రమళ్ల బులివీరయ్య, వల్లూరి రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ఇంజినీరింగ్ విద్యార్థులకు అవగాహన

ప్రజాశక్తి-కాట్రేనికోన

చెయ్యేరు శ్రీనివాస స్వయం ప్రతిపత్తి ఇంజనీరింగ్ కళాశాల్లో ' ఉన్నత విద్యా సంస్థల్లో పాటించవలసిన నాణ్యతా ప్రమాణాలు, అమలుకై తీసుకోవలసిన చర్యలు అనే అంశముపై అవగాహనా సదస్సును కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ సిహెచ్‌విఎస్. పరమేశ్వరరావు ప్రారంభించారు. ముఖ్య అతిధిగా నెల్లూరు నారాయణ ఇంజినీరింగ్ కళాశాల ప్రొఫెసర్ డాక్టర్ పి. పెంచలయ్య విచ్చేశారు. ఆయన ప్రసంగిస్తూ కాలానుగుణంగా సాంకేతికతతో వస్తున్న వినూత్న మార్పులకనుగుణంగా, ఉన్నత విద్య సంస్థల్లో నాణ్యతా ప్రమాణాలను మార్పులు చేస్తూ విద్య సంస్థల్ని అత్యున్నత స్థాయిలో నిలపాలని, 'నాణ్యతా ప్రమాణాలు అనుసరించు వివిధ విధానాలను పవర్ పాయింట్ ప్రెసెంటేషన్ ద్వారా విశదీకరించారు. సభాధ్యక్షులు కళాశాల ప్రిన్సిపల్ పరమేశ్వరరావు మాట్లాడుతూ కళాశాల విద్యా నాణ్యతా ప్రమాణాలు రూపకల్పన అమలు తదితర అంశాలను ఆయన వివరించారు. కార్యక్రమంలో కళాశాల సెక్రటరీ కరెస్పాండెంట్ డివి ఎన్ఎస్. వర్మ, పాలకవర్గ సభ్యులు రమేష్ రాజు, సందీప్, కళాశాల ఐ క్యూఎసి విభాగాధిపతి రత్నరాజు, వివిధ విభాగాల కోఆర్డినేటర్లు, అధ్యాపకులు, పాల్గొన్నారు.

గ్రామాల్లో జగనన్న పాలవెల్లువ

ప్రజాశక్తి-సామర్లకోట రూరల్

ప్రభుత్వం చేపట్టనున్న జగనన్న పాలవెల్లువ కార్యక్రమం విజయ వంతగా గ్రామాల్లో చేపట్టాలని సామర్లకోట ఎంపిడిఒ డి.శ్రీలలిత పిలుపు నిచ్చారు. శనివారం ఎంపిడిఒ ఆధ్వర్యంలో మండలంలోని వికెరాయపురంలో గ్రామ వలంటీర్లకు అవగాహన సదస్సు నిర్వహిం చారు. సాయంత్రం స్థానిక ఎంపిడిఒ కార్యాలయంలోని తన ఛాంబర్‌లో తహశీల్దార్ ఎస్.లక్ష్మీనరస కుమారి, ఇన్‌చార్జి ఇఒపిఆర్‌డి కె.శ్రీహరి, మండల పరిధిలోని వెటర్నరీ అసిస్టెంట్ సర్జన్‌లు, గ్రామ పంచాయతీ కార్యదర్శులతో గ్రామాల వారీగా సమీక్షించారు. కార్యక్రమంలో కార్యాలయం ఎఒ విప్పర్తి వీరసాయిబాబు, ఉపాధిహామీ ఎపిఒ ప్రభాకరరావు, డిఆర్‌డిఎ ఎపిఎం, సిబ్బంది పాల్గొన్నారు.

యానాం వార్తలు

వృద్ధాప్య పింఛన్లు మంజూరు

ప్రజాశక్తి - యానాం

పుదుచ్చేరి ప్రభుత్వం మత్స్యశాఖ ద్వారా యానాంలో ఉన్న 252 మంది మత్స్యకారులకు కొత్తగా వృద్ధాప్య పింఛన్లు ప్రభుత్వం మంజూరు చేసినట్లు స్థానిక ఎమ్మెల్యే గొల్లపల్లి శ్రీనివాస్ అశోక్ తెలిపారు. శనివారం మత్స్యశాఖ మంత్రి లక్ష్మీనారాయణ లబ్దిదారుల జాబితాను ఎంఎల్ఏ గొల్లపల్లి శ్రీనివాస్ అశోక్‌కు అందజేసినట్లు తెలిపారు. ఈ సందర్భంగా పుదుచ్చేరి ఎల్జి తమిళిసై, ముఖ్యమంత్రి రంగసామి, మంత్రి లక్ష్మీనారాయణలకు ఎమ్మెల్యే అశోక్ కృతజ్ఞతలు తెలియజేశారు.

వేతనాల పెంపునకు చర్యలు

యానాం విద్యాశాఖలో మిల్క్ బాయిలర్స్ గా పనిచేస్తున్న ఉద్యోగుల వేతనాలు పెంపుకు చర్యలు తీసుకుంటున్నట్లు ఎంఎల్ఎ గొల్లపల్లి శ్రీనివాస్ అశోక్ తెలిపారు. ఈ సందర్భంగా శనివారం పుదుచ్చేరి విద్యా శాఖ మంత్రి నమశ్శివాయం ను కలిసి మిల్క్ బాయిలర్స్‌కు జీతాలు పెంచాలని, అదేవిధంగా 12 నెలల బకాయి వేతనాలు ఇవ్వాలని చర్యలు తీసుకోవాలని కోరారన్నారు. మంత్రి నమశ్శివాయం తక్షణమే స్పందించి జీతాలు పెంచడానికి అధికారులను ఆదేశించినట్లు తెలిపారు. గడిచిన పుదుచ్చేరి అసెంబ్లీ సమావేశాల్లో మిల్క్ బాయిలర్స్‌కు రూ.10వేలు నుండి రూ.18 వేలకు పెంచాలని అశోక్ డిమాండ్ చేసినట్లు ఆయన గుర్తు చేశారు.

ఉప్పంగల నీటి శుద్ధి కేంద్రం పరిశీలన

పక్క ప్రాంతం ఉప్పంగల గ్రామంలో ఉన్న మంచినీటి చెరువు నీటి శుద్ధి కేంద్రాన్ని ఆర్ఎఒ మునిస్వామి సంబంధిత అధికారులతో కలిసి శనివారం సందర్శించారు. ప్రజలకు నీటిని అందించే విధానాన్ని అక్కడ పని చేస్తున్న వారిని వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఆ చెరువు నుండి 14 గ్రామాలకు నీటినందిస్తున్నట్లు ఆర్ఎఒ మునిస్వామికి అక్కడి అధికారులు తెలిపారు.

ఐటిఐ కోర్సులకు దరఖాస్తుల ఆహ్వానం

2023 - 24 విద్యా సంవత్సరానికి సంబంధించి స్థానిక నేతాజీ సుభాష్ చంద్రబోస్ ప్రభుత్వ ఐటిఐలో కోర్సుల ప్రవేశానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ చింతపల్లి కృష్ణసుధాకర్ శనివారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఈ కళాశాలలో మెకానిక్ మోటార్ వెహికల్, వైర్‌మన్, ఫ్యాషన్ డిజైనింగ్ అండ్ టెక్నాలజీ, కంప్యూటర్ ఆపరేటర్ అండ్ ప్రోగ్రామింగ్ అసిస్టెంట్ కోర్సులకు శిక్షణ ఇస్తున్నట్లు తెలిపారు. ప్రతినెల రూ.1000 స్టైఫండ్, రూ.1000మెరిట్ స్కాలర్షిప్, ఉచిత భోజనం, యూనిఫామ్ విద్యార్థులకు అందజేస్తామని తెలిపారు.

వాలీబాల్ పోటీలకు వరుణ్ సందీప్

ప్రజాశక్తి - కోటనందూరు



వరుణ్ సందీప్‌తో అసోసియేషన్ కార్యదర్శి యశ్వంత్

మండలంలో భీమవరపుకోట గ్రామానికి చెందిన రావాడ వరుణ్ సందీప్ ఈ నెల 28వ తేదీన వెస్ట్ బెంగాల్లో జరుగుతున్న 45వ సబ్ జూనియర్, అంతర్ రాష్ట్ర జూనియర్ వాలీబాల్ పోటీలకు ఎంపికయినట్టు ఉభయగోదావరి గోదావరి జిల్లాల వాలీబాల్ అసోసియేషన్ కార్యదర్శి కుంచె యశ్వంత్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎ.మల్లవరం ఆశ్రమ పాఠశాలలో ఇంటర్మీ డియట్ ప్రథమ సంవత్సరం చదువుతున్న వరుణ్ సందీప్ మండల స్థాయి, జోనల్ స్థాయి, జిల్లాస్థాయి, అంతర్ జిల్లాలో, రాష్ట్రస్థాయిలో జరిగిన వాలీబాల్ పోటీల్లో ఉత్తమ ప్రతిభ కనబరచడంతో అంతరాష్ట్ర వాలీబాల్ టీమ్‌లోకి ఎంపిక చేసినట్టు యశ్వంత్ తెలిపారు. తమ గ్రామానికి చెందిన వరుణ్ సందీప్ ఎంపికపై సర్పంచ్ జగటాల వీరబాబు, ఎంపిటిసి కొత్తపల్లి మాణిక్యాలరావు, వీర యువసేన యూత్ అధ్యక్షులు అనుకుల రిసార్ఫ్ సామ్యూల్, మండల కో ఆప్షన్ సభ్యులు జగటాల కోట సత్తిబాబు హర్షం వ్యక్తం చేశారు.



వికలాంగుల నిరసనలో పాల్గొన్న మంద కృష్ణ మాదిగ

వికలాంగుల సమస్యలు పరిష్కరించాలి

ప్రజాశక్తి - కాకినాడ

రాష్ట్రంలో వికలాంగులు ఎదుర్కొంటున్న సమస్యలు తక్షణం పరిష్కరిం చాలని ఎంఆర్‌పిఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణ మాదిగ డిమాండ్ చేశారు. ఏపీలో వికలాంగులు ఎదుర్కొంటున్న సమస్యలపై వికలాంగుల హక్కుల పోరాట సమితి చేపట్టిన రాష్ట్ర స్థాయి ధర్నాలో భాగంగా శనివారం కాకినాడ ధర్నా చౌక్ వద్ద జరిగిన నిరసన ప్రదర్శనలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. సుదీర్ఘ పోరాటాలు ఫలితంగా వికాలంగులకు పింఛన్ రూ.3వేలకు చేరిందన్నారు. ప్రస్తుత ధరబారాల నేపథ్యంలో పింఛన్ రూ.6 వేలకు పెంచి ఇవ్వాలని డిమాండ్ చేశారు. అదేవిధంగా 32 ప్రధాన డిమాండ్‌లు పరిష్కరించాలన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర అధ్యక్షుడు అన్నం చిన్న సుబ్బయ్య యాదవ్, జిల్లా అధ్యక్షులు షేక్ నబి, నవీన్, ఎంఆర్‌పిఎస్ నేతలు, వికలాంగులు పాల్గొన్నారు.



వాలంటీర్లను సత్కరిస్తున్న దృశ్యం

వాలంటీర్లకు సేవామిత్ర పురస్కారాలు

ప్రజాశక్తి-ఆలమూరు

మడికి గ్రామపంచాయతీ పరిధిలో గల చిలకలపాడు, మల్లవానితోట శివారు గ్రామాల్లో పనిచేస్తున్న 57 మంది వాలంటీర్లకు సేవా మిత్ర పురస్కారాలను ఆ గ్రామ సర్పంచ్ యు లక్ష్మీ మౌనిక గ్రామ పంచాయతీ కార్యాలయం వద్ద అందజేసి, వారిని సత్కరించారు. ముఖ్య అతిథులుగా పాల్గొన్న ఆలమూరు వ్యవసాయ సలహా మండల కమిటీ ఛైర్మన్ యనమదల నాగేశ్వరరావు, వైసిపి నాయకుడు యు.సుందర విజయం మట్లాడుతూ ఎన్నో సంక్షేమ పథకాలను ప్రజలకు పారదర్శకంగా, సమర్థవంతముగా ప్రజలకు చేరేలా చేసే వాలంటీర్లేనని కొనియాడారు. రాష్ట్రంలో సుమారు 3 లక్షల మంది వాలంటీర్లుగా తమ సేవలను ప్రజలకు అందిస్తున్నారని అన్నారు. వారి సేవల ప్రాతిపదికన ఒక్కొక్కరికి రూ.10 వేల చొప్పున తమ ఖాతాలకు జమ అవుతుందని తెలిపారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి ఎం.మోక్షంజలి, కొప్పిశెట్టి కాసులు, జంగా వీరబాబు, తమ్మన శ్రీను, కొండపల్లి శ్రీను, కొత్తపల్లి శ్రీనివాసు పలువురు పాల్గొన్నారు.

అనారోగ్యంతో ఆశా వర్కర్ మృతి

ప్రజాశక్తి - కాజులూరు

అనారోగ్యంతో ఆశా వర్కర్ మాసగిరి నాగ మణి (45) మృతి చెందింది. స్థానికులు, కుటుంబ సభ్యులు చెప్పిన వివరాలు ప్రకారం శుక్రవారం విధులు నిర్వహించి ఇంటికి వెళ్లిన నాగమణి ఆకస్మాత్తుగా కుప్పకూలిపోవడంతో యానం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా మెరుగైన చికిత్స కోసం కాకినాడ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అక్కడ డాక్టర్లు పరిశీలించి హైబిపి, కిడ్నీ సమస్యలు ఎదురవడంతో కోమాల్లోకి వెళ్లినట్లు వారు తెలిపారు. శనివారం రాత్రి చికిత్స పొందుతూ మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. నాగమణి భర్త ప్రైవేట్ కంపెనీలో పనిచేస్తుండగా, ఇద్దరు వివామైన కుమార్తెలు ఉన్నారు.

పొలిటికల్ జోష్



ప్రజాశక్తి- రాజమహేంద్రవరం ప్రతినిధి

అధికార, ప్రతిపక్ష పార్టీల అధినేతల రాకతో జిల్లాలో పొలిటికల్ జోష్ నెలకొంది. 'జగనన్న విద్యాకానుక' ప్రారంభోత్సవానికి రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి హాజరైన విషయం విధితమే. ఈ కార్యక్రమం విజయవతం చేసేందుకు జిల్లా యంత్రాగం శతవిధాలా ప్రయత్నించింది. జిల్లాలోని ఆర్‌టిసి బస్సులతో పాటు, ప్రైవేట్ కాలేజీల బస్సులను ప్రజల తరలింపు కోసం వినియోగించారు. ప్రజలతో పాటు కళాశాలల నుంచి విద్యార్థులతో సభను నింపేందుకు చేసిన ప్రయత్నం ఫలించింది. అయితే ఉదయం 7 గంటలకు సభా వేదిక వద్దకు తరలించి వారి అవసరాలకు తగ్గట్లుగా ఏర్పాట్లు చేయడంలో విఫలం అయ్యారు. మధ్యాహ్నం ఒంటి గంటకు సభ ముగిసంది. భోజన సదుపాయాలు లేకపోవటంతో ఎండలో తిరిగి తమ ఇళ్లకు వెళ్లేందుకు అవస్థలు పడ్డారు. వైసిపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత తొలిసారి కొవ్వూరుకు వచ్చిన జగన్ జిల్లాలో దీర్ఘకాలిక ప్రాజెక్టులు, స్థానిక సమస్యల పరిష్కారానికి చొరవ చూపుతారని ఆశించిన ప్రజలకు నిరుత్సాహం తప్పలేదు. కొవ్వూరు నియోజకవర్గంపై మాత్రం వరాల జల్లు కురిపించారు. వ్యవసాయ ఆధారిత ఉభయ గోదావరి జిల్లాలో సాగునీటి కాల్వల పూడిక తీత, జలాశయంలో నీటి నిల్వ పెంచుకునేందుకు గోదావరి డ్రెడ్జింగ్, బ్యారేజీ మరమ్మతులకు నిధులు కేటాయింపుల ప్రస్తావన ఎక్కడా తేలేదు. ప్రతిపక్ష పార్టీపై ఆరోపణలు చేయడానికే ఎక్కువ ప్రాధాన్యతనిచ్చారు.

● మహానాడుతో టిడిపిలో జోష్

తెలుగుదేశం పార్టీ ఆధ్వర్యంలో జిల్లాలో నిర్వహిస్తున్న మహానాడు ఆ పార్టీ కార్యకర్తల్లో కొత్త ఉత్సాహాన్ని నింపింది. జిల్లా కేంద్రమైన రాజమహేంద్రవరంలోని వేమగిరి ఈ వేడుకకు వేదికగా నిలిచింది. శనివారం నిర్వహించిన ప్రతినిధుల సభకు వేలాదిగా హాజరై విజయవతం చేశారు. ఆదివారం జరగబోయే కార్యక్రమానికి భారీ సంఖ్యలో కార్యకర్తలు, ఎన్‌టిఆర్ అభిమానులు తరలిరానున్నారని ఆ పార్టీ శ్రేణులు అంచనా వేస్తున్నారు. ఈ కార్యక్రమం నిర్వహణకు జిల్లాలోని ముఖ్యనేతలు గత నెల రోజులుగా పగడ్బంధీ ప్రణాళికలు రూపొందించారు. సుమారు 200మంది సభ్యులతో టీములు వారీగా ప్రణాళికబద్ధంగా పని చేయటం విజయవంతం కావటానికి ఒక కారణమని తెలుస్తోంది. ఈ కార్యక్రమాన్ని అడ్డుకునేందుకు అధికార పార్టీ నేతలు నానా రకాలుగా ప్రయత్నించారు. ఫ్లెక్సీల రాజకీయం రెండు మూడు రోజులు నడిచింది. మహానాడు నేపథ్యంలో జిల్లాకు రాబోయే ప్రతినిధులకు సౌకర్యాలు కల్పించటంలో భాగంగా పలు హెూటళ్లను, కళ్యాణ మండపాలను టిడిపి ముఖ్యనేతలు ముందుగానే బుక్ చేసుకున్నారు. అయితే అధికార పార్టీకి చెందినవారు సైతం కొన్ని హోటల్స్‌లో రూమ్‌లు బుక్ చేసుకుని ఈ రెండు రోజులూ ఖాళీగా ఉంచడం పలు విమర్శలకు దారి తీస్తోంది. దీని వెనుక ఇసుక మాఫియాలోని ముఖ్య వ్యాపా రులు ఉన్నట్లు సమాచారం. తొలిరోజు సభ నిర్వహణకు ట్రాఫిక్ అంతరాలతో కొంత ఇబ్బంది పడినా సభ సజావుగానే జరిగింది.

● ఠారెత్తిస్తున్న ఎండలు

వేసవి ఉష్ణోగ్రతలు ఠారెత్తిస్తున్నాయి. రోహిణీ కార్తె రాకతో ఒక్క సారిగా ఎండలు పెరిగాయి. ఉమ్మడి జిల్లాలో సరాసరిన 43 డిగ్రీల సెల్సియస్‌కు పైగా ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. రాజమహేంద్రవరం, కాకినాడ పట్టనాలు గోదావరి నది, సముద్రానికి ఒడ్డున ఉండటంతో వేసలి గాల్పులు అధికంగా ఉంటున్నాయి. దీంతో ప్రజలు ఇంటినుంచి బయటకు వచ్చేందుకే వెనకడుగు వేస్తున్నారు. ఫలితంగా మధ్యాహ్నం 12 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకూ పలు ముఖ్య కూడళ్లు ఖాళీగా దర్శనమిస్తున్నాయి. అత్యధిక మంది హోల్‌సేల్ వ్యాపారులు తమ దుకాణాలను మూసివేసి తిరిగ సాయంత్రం తీస్తున్నారు. వేతన జీవులు ఉపాధి కోసం ఎండలోనే పనులు చేస్తున్నారు. కార్పొరేషన్‌లు, మున్సిపాలిటీలు, పలు స్వచ్ఛంధ సంస్థలు నిర్వహిస్తున్న చలివేంద్రాలు కొంత ఊరట నిస్తున్నాయి. ప్రజల దప్పికను తీరుస్తున్నాయి. వైద్య ఆరోగ్య శాఖ క్షేత్రస్థాయికి వచ్చి ప్రజలకు మరింత అందుబాటులో ఉండాలని సర్వత్రా కోరుతున్నారు.

● అప్రకటిత విద్యుత్ కోతలు

జిల్లాలో విద్యుత్ అప్రకటిత అంతరాయాలు గోరుచుట్టు పై రోకలి పోటులా మారాయి. ఆక్వా రంగంపై తీవ్ర ప్రభావం కన్పిస్తోంది. రాత్రి వేళల్లో మూడు నుంచి నాలుగు గంటల పాటు కోత విధించటంతో ఏరియేటర్లపై ఆధారపడాల్సి వస్తోంది. ఏరియేటర్ల కోసం వినియోగించే డీజిల్ అధనపు భారంగా మారింది. మరో వైపు నివాస ప్రాంతాల్లో విద్యుత్ అంతరాయాల కారణంగా ఉక్కపోతతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. కొన్ని ముఖ్య పట్టణాలలో మరమ్మతులు, ఆధునికీకరణ పేరుతో విద్యుత్‌కోతలపై అధికారులు ముందుగానే ప్రకటనలు ఇస్తున్నా నిర్దేశిత సమయానికి సరఫరా పునరుద్ధరించటంలేదనే విమర్శలు విన్పిస్తున్నాయి. దీనిపై ఆ శాఖ ఉన్నతాధికారులు దృష్టి సారించాల్సి ఉంది.

రాష్ట్ర స్థాయి రగ్బీ పోటీలు ప్రారంభం

క్వార్టర్ ఫైనల్స్ కి చేరిన 8 జట్లు

ప్రజాశక్తి - పిఠాపురం

8వ రాష్ట్రస్థాయి సీనియర్ మహిళ పురుషుల రగ్బీ పోటీలు శనివారం ప్రారంభమయ్యాయి. ఆంధ్రప్రదేశ్ రగ్బీ అసోషియేషన్ వారి ఆదేశాల మేరకు ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా రగ్బీ అసోషియేషన్ ఆధ్వర్యంలో నిర్వహి స్తున్న పోటీలను స్థానిక మినీ స్టేడియంలో ఎంఎల్‌ఎ పెండం దొరబాబు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర స్థాయి పోటీల క్రీడాకారులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా చూసే బాధ్యత తమ మీద ఉందని తమ నియోజకవర్గ కి వచ్చినందుకు తాము ఎంతో సంతోషిస్తున్నట్లు ఆయన తెలిపారు. రాష్ట్రస్థాయి పోటీలను పట్టణంలో ఏర్పాటుచేసిన నిర్వాహకులను అభినందించారు. అనంతరం క్రీడాకారులతో కరచాలనం చేసి అభినందించారు. అనంతరం శనివారం 11 జిల్లాల ప్రతినిధులు పోటీల్లో పాల్గొనగా పురుషుల విభాగం నుంచి నెల్లూరు, అనంతపురం, తూర్పుగోదావరి, కృష్ణా, కర్నూలు చిత్తూరు, శ్రీకాకుళం, గుంటూరు జట్లు క్వార్టర్ ఫైనల్స్ చేరుకున్నాయని నిర్వాహకులు తెలిపారు. మహిళా విభాగ పోటీలు కొనసాగుతున్నాయి. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ రామ్మోహన్, తూర్పు గోదావరి జిల్లా ఒలింపిక్ అసోసియేషన్ అధ్యక్షులు పద్మనాభం, ఎపి రగ్బీ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి రామాంజనేయులు, తూర్పుగోదావరి జిల్లా రగ్బీ రగ్బీ సంఘం జిల్లా అధ్యక్షులు ఇమిడిశెట్టి నాగేంద్ర కుమార్ , కోచ్ పి లక్ష్మణ్ రావు, ఉపాధ్యక్షులు కేతవరపు కృష్ణా, సామర్లకోట మున్సిపల్ వైస్ చైర్మన్ ఉబా జాన్‌మోజేష్, స్థానిక ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు. సాయంత్రం క్యాంప్ ఫైర్‌కి పిఠాపురం మాజీ ఎంఎల్‌ఎ టిడిపి అధికార ప్రతినిధి ఎస్‌విఎస్ఎన్ వర్మ పాల్గొన్నారు. పిల్లా సత్యనారాయణ శిష్య బృందం సాంస్కృతిక కార్యక్రమాలు పలువురు ఆకట్టుకున్నాయి.



పోటీలను ప్రారంభిస్తున్న ఎంఎల్‌ఎ దొరబాబు



గరగలకు ప్రత్యేక పూజలు చేస్తున్న ఆలయ ట్రస్టీ బ్రహ్మాజీ, ఎసి రామ్మోహనరావు

ఘనంగా తొలి గరగల ఉత్సవం

ప్రజాశక్తి - పెద్దాపురం

పెద్దాపురంలో జూన్ 18వ తేదీ నుండి ప్రారంభమయ్యే మరిడమ్మ జాతర సందర్భంగా శనివారం మరిడమ్మ తొలి గరగల ఉత్సవం ప్రారంభానికి ముందు జాతర ప్రారంభ సూచికంగా రాటను ఏర్పాటు చేశారు. అనంతరం గరగలకు ప్రత్యేక పూజలు చేసి గరగలు, డప్పుల నృత్యాలతో మరిడమ్మ అమ్మవారి పుట్టిల్లుగా పిలుచుకునే సామర్లకోటలోని చింతపల్లి వారి ఇంటికి వెళ్లారు. అనంతరం ఆనవాయితీ ప్రకారం నియమిత వీధులలో గరగల ఉత్సవం కొనసాగింది. కార్యక్రమంలో ఆలయ ఫౌండర్ ట్రస్టీ డాక్టర్ చింతపల్లి బ్రహ్మాజీ, ఆలయ అసిస్టెంట్ కమిషనర్ సిహెచ్ రామ్మోహనరావు, ఆశాధులు, పండితులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

సాదాసీదాగా మండల సమావేశం

ప్రజాశక్తి- కరప

కరప మండల ప్రజా పరిషత్ సమావేశ భవనంలో శనివాం నిర్వహించిన మండల సర్వసభ్య సమావేశం సాదాసీదాగా ముగిసింది. ఎంపిపి పెంకె శ్రీలక్ష్మి సత్తిబాబు అధ్యక్షతన, ఎంపిడిఒ కె.స్వప్న ఆధ్వర్యంలో వివిధ అభివద్ధి పనులపై సమీక్ష నిర్వహించారు. ఈ సమావేశానికి పూర్తిస్థాయిలో ప్రజాప్రతినిధులు రాకపోవడంతో కోరం లేక సమావేశ మందిరం వెలవెల బోయింది. సమావేశంలో వ్యవసాయ శాఖ అధికారి రాజేష్ మాట్లాడుతూ రైతులకు జూన్ ఒకటోవ తేదీ నాటికి నీటిని విడుదల చేయనున్నట్టు తెలిపారు. ఆర్‌బికెల్లో స్వర్ణ విత్తనాలు అందుబాటులో ఉన్నాయని, రైతులు సద్వినియోగం చేసుకోవా లన్నారు. హౌసింగ్ ఎఇ మాట్లాడుతుండగా సర్పంచులు, ఎంపిటిసిలు హౌసింగ్ నిర్మాణ లోనులు రావడంలేదని అడ్డు తగిలారు. దీంతో ఆయన చేసేదేమీ లేక హౌసింగ్ అనేది కేంద్ర ప్రభుత్వ పరిధిలోనిదని మొత్తం ఆన్‌లైన్ ప్రాసెస్ కావడంతో ఆలస్యం అవుతుందని తెలిపారు. ఆర్‌టిసి అధికారి మాట్లాడుతూండగా మండలంలోని వివిధ బస్టాప్‌లో వద్ద పల్లె వెలుగు బస్సులు సక్రమంగా ఆపడం లేదని స్కూల్ పిల్లలు ఇబ్బందులు పడుతున్నారని సర్పంచులు, ఎంపిపి శ్రీలక్ష్మి తెలిపారు. ఈ సందర్భంగా దీనిపై చర్యలు తీసుకుంటామని ఆయన హామీ ఇచ్చారు. వృద్ధులకు, స్కూల్ పిల్లలకు జూన్ నుండి పాస్‌లు ఇస్తున్నట్టు తెలిపారు. ఎంఇఒ కృష్ణవేణి మాట్లాడుతూ 2023 సంవత్సరంలో పదో తరగతి 72శాతంతో పాస్ అయ్యారని అకాడమీ పుస్తకాలు విద్యా వనరుల కేంద్రానికి అందజేయనున్నట్టు తెలిపారు. ప్రైవేట్ స్కూళ్లలో 25 శాతం రిజర్వేషన్‌ను 2023 సంవత్సరం నుంచి అమలచేయనున్నట్టు ఆమె తెలిపారు. తహశీల్దార్ పొన్నమండ శ్రీనివాసరావు సర్టిఫికెట్ విషయాలలో జాప్యం లేకుండా అంది స్తున్నామన్నారు. ఎంపిడిఒ కె. స్వప్న మాట్లాడుతూ 15వ ఆర్థిక సంఘం నిధులను అసంతృప్తిగా ఉన్న సచివాలయాలు, ఆర్‌బికెల నిర్మాణాలకు కేటాయింపులకు సభ్యులతో తీర్మానం చేసినట్లు ఆమె తెలి పారు. సమావేశంలో సూపరింటెండెంట్ భీమ శంకర్రావు, ఎలక్ట్రికల్ ఎఇ ప్రసాద్, పశుసంవర్ధక శాఖ ఎడి సురేష్ బాబు, కార్యదర్శులు పి వీరభద్రరావు, సునీల్ కుమార్, బ్రహ్మానందం, నాగేంద్ర, శ్రీనివాస్ పాల్గొన్నారు.

15 రోజుల్లో సమగ్ర సర్వే పూర్తి చేయాలి

ప్రజాశక్తి - కాకినాడ కార్పొరేషన్

నగరపాలక సంస్థ పరిధిలో ఉన్న నివాసాలు, కుటుంబాలు, వ్యాపార సంస్థలకు సంబంధించి ఖచ్చితమైన సమాచారంతో సమగ్ర సర్వే 15 రోజుల వ్యవధిలో పూర్తి చేయాలని కమిషనర్ ఆర్. మహేష్ కుమార్ ఆదేశించారు. స్మార్ట్ సిటీ కార్యాలయంలో మంగళవారం ప్రత్యేకాధికారులు, నోడల్ అధికారులు,సచివాలయ కార్యదర్శులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ ప్రతి సచివాలయ పరిధిలో ఎన్ని ఇళ్లు, ఎన్ని కుటుంబాలు ఉన్నాయి.. ఎన్ని వ్యాపార సముదాయాలు ఉన్నాయి. ఆ నివాసం అసెస్మెంట్ పరిధిలో ఉందా లేదా, యూజర్ చార్జీలు చెల్లిస్తున్నదీ లేనిదీ వంటి సమాచారంతో సర్వే చేయాలన్నారు. ఏ ఒక్క ఇల్లు, కుటుంబం, వ్యాపార సంస్థను విడిచి పెట్టకుండా సర్వే పరిధిలోకి తీసుకురావాలని సూచించారు. ఎడిసి సిహెచ్ నాగ నరసింహారావు మాట్లాడుతూ సర్వే ప్రక్రియను నోడల్ అధికారులు స్వయంగా పర్యవేక్షించాలని, సర్వేకు ఆయా సచివాలయాల అడ్మిన్లు, వాలంటీర్లు, ఇతర సిబ్బంది సంపూర్ణ సహకారం అందించాలని స్పష్టం చేశారు. జిఎస్‌డబ్ల్యూఎస్ డేటాకు, అసెస్మెంట్‌లకు, యూజర్ చార్జీలు చెల్లిస్తున్న వారికి మధ్య చాలా వ్యత్యాసం కనిపిస్తున్న నేపథ్యంలో ప్రస్తుతం చేపడుతున్న ఈ సర్వే ఎంతో ప్రయోజనం కలుగుతుందన్నారు. వ్యాపార సంస్థలకు సంబంధించి ట్రేడ్ లైసెన్స్ ఉందో లేదో పరిశీలించాలన్నారు. నిర్ణీత ప్రొఫార్మా ప్రకారం సర్వేను పూర్తి చేయాలని సూచించారు. సర్వేలో పారదర్శకత లోపించినా, సమాచార సేకరణలో నిర్లక్ష్యం కనిపించిన కఠిన చర్యలు తప్పవని పేర్కొన్నారు. పారదర్శకంగా సర్వే చేస్తే నమోదు కాని అసెస్మెంట్‌లు, ట్రేడ్ లైసెన్సులు తీసుకొని వ్యాపార సంస్థలు, యూజర్ చార్జీలు చెల్లించని కుటుంబాల సమాచారం బయటపడుతుందన్నారు సమావేశంలో నగరపాలక సంస్థ కార్యదర్శి ఎం.ఏసుబాబు, మేనేజర్ కర్రి సత్య నారాయణ, టిపిఆర్‌ఓ మానే కృష్ణమోహన్, ఉద్యాన సహాయ సంచాలకులు టీవీ సిరిల్, డీఈలు, ఎఇలు, ప్రత్యేక అధికారులు,, నోడల్ అధికారులు, శానిటరీ సూపర్వైజర్లు జిలాని, రాంబాబు, శానిటరీ ఇన్‌స్పెక్టర్లు పాల్గొన్నారు.

నవయుగ వైతాళికుడు కందుకూరి

ప్రజాశక్తి - కాకినాడరూరల్

సంఘసంస్కర్త, బహుముఖ ప్రజ్ఞాశాలి, తెలుగుజాతికి నవయుగ వైతాళికుడు కందుకూరి వీరేశలింగం అన్ని సాహితీ వేత్త డాక్టర్ శిరీష అన్నారు. స్థానిక బోట్ క్లబ్ ఉద్యానవనం వద్ద కందుకూరి వీరేశలింగం వర్ధంతి సభ నిర్వహించారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ 1848 ఏప్రిల్ 16న రాజమండ్రిలో జన్మించారని,1919 మే 27న చెన్నైలో ఆయన మరణించారని తెలిపారు. వీరేశలింగం స్త్రీ విద్యకై ఉద్యమించి, బాలికలకు పాఠశాలను ప్రారంభించి, రాష్ట్రంలో బ్రహ్మ సమాజం, హితకారిణి సమాజం స్థాపించి తన యావదాస్తిని దానికి దానం చేశారన్నారు. ఎన్నో గ్రంధాలను ఆయన రచించా రని, వివేకవర్థిని' అనే పత్రికను ప్రారంభించారని అన్నారు. బాల్యవివాహాలను వ్యతిరేకించడంతోపాటు వితంతు పునర్వివాహాలను ప్రోత్సహించారని అన్నారు. కార్యక్రమంలో అడబాల రత్న ప్రసాద్, రేలంగి బాపిరాజు, తు రగా సూర్యారావు, అడబాల సత్యనారాయణ పాల్గొన్నారు.



వీరేశలింగం విగ్రహం వద్ద నివాళులు

పూడికతీత పనుల పరిశీలిన

ప్రజాశక్తి - కాకినాడ కార్పొరేషన్

మేజర్ డ్రైన్లలో పూడిక తొలగింపు పనులను కాకినాడ నగరపాలక సంస్థ అదనపు కమిషనర్ సిహెచ్ నాగ నరసింహారావు, 7వ 8 వ సర్కిల్లో శనివారం ఆయన బాపూజీ నగర్, పెద్ద మార్కెట్, ఘాటి సెంటర్ ప్రాంతాలలో ఉన్న డ్రైన్ల పూడికతీత పనులను పరిశీలించారు. వర్షాలు పడితే డ్రైన్లు మునిగే పరిస్థితి ఉన్నందున తక్షణమే అవసరమైన చర్యలు తీసుకోవాలని అన్నారు. అనంతరం పారిశుధ్య పనులను కూడా ఆయన పర్య వేక్షించారు. తడి- పొడి చెత్త